క్లుప్తంగా

లీలావతికి డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గ్రామీణాభివృద్ధి విభాగం పరిశోధకురాలు పి.లీలావతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. గ్రామీణాభివృద్ధి విభాగ పరిశోధనా పర్యవేక్షకులు ఆచార్య కె. సోమశేఖర్ పర్యవేక్షణలో 'ఆంధ్రప్రదేశ్‌లో కలంకారి కళ కృష్ణా జిల్లాపై ప్రధాన పరిశీలన' అనే అంశంపై పరిశోధనా గ్రంథం సమర్పించారు. లీలావతి విజయవాడలోని పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకురాలుగా పనిచేస్తున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ నాయకుల పర్యటన

చేబ్రోలు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతు సమస్యలు, గిట్టుబాటు ధర, ధాన్యం సేకరణ తదితర అంశాలపై పార్టీ జిల్లా నాయకులు క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా బుధవారం చేబ్రోలు మండలం శలపాడు గ్రామంలో పర్యటించనున్నట్లు మంగళవారం పార్టీ నాయకులు తెలిపారు. గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు అంబటి రాంబాబు, గుంటూరు పార్లమెంటు పరిశీలకుడు మోదుగుల వేణుగోపాలరెడ్డి, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఉదయం 11గంటలకు మండల పరిధిలోని శలపాడు గ్రామంలో పర్యటించనున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ప్రత్తిపాడు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు ఎస్ఐ కె.నాగేంద్ర అన్నారు. సైబర్ క్రైమ్ వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో మంగళవారం రాత్రి ఎస్ఐ కె.నాగేంద్ర, విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ దేశంలో రోజురోజుకీ సైబర్ నేరాలు ఎక్కువవుతున్నాయన్నారు. అమాయకులు, నిరక్షరాస్యులతో పాటు చదువుకున్న వారు కూడా సైబర్ మోసగాళ్ల ఉచ్చులో చిక్కుకుంటున్నారని తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

గుంటూరు రూరల్: సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం నల్లపాడు పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో పెదపలకలూరులోని విజ్ఞాన్ నిరుల కళాశాల నుంచి గుజ్జనగుండ్ల సెంటర్ వరకు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గుజ్జనగుండ్ల సెంటర్‌లో మానవ హారం ఏర్పాటు చేసి సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తులతో ఓటీపీలు తెలియజేయాలని, ఆన్‌లైన్‌లో వచ్చే లింకులు ఓపెన్ చేయరాదని తెలిపారు. కార్యక్రమంలో నల్లపాడు పోలీసు స్టేషన్ సీఐ వంశీధర్ పాల్గొన్నారు.

ఆశ్రమానికి దివ్యాంగుడి తరలింపు



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రంలో గత కొద్ది నెలలుగా మతిస్థిమితం లేని ఓ వికలాంగ యాచకుడు రోడ్డుపై పాకుతూ జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల కిందట అతడిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. నాటి నుంచి పాకడం కూడా అత్యంత కష్టమై నడిరోడ్డుపైనే పడుకుంటున్నాడు. గమనించిన ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర మానవత్వాన్ని చాటారు. స్థానిక పోలీసులు, పంచాయతీ సిబ్బంది సహకారంతో యాచకుడిని గుంటూరులోని నిర్మల్ హృదయ్ ఆశ్రమానికి తరలించారు.

నీటి సంఘాల ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

పొన్నూరు: నీటి సంఘాల ఎన్నికలు ఈ నెల 14వ తేదీన పకడ్బందీగా నిర్వహించాలని ఇరిగేషన్ చీరాల డీఈ, మాస్టర్ ట్రైనర్ ఎన్‌కేవీ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియపై పీఓ, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు వెంకటేశ్వరరావు, జానీబాషా, రత్నకిషోర్, రామ్మూర్తి పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ తరలింపునకు చర్యలు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని మూడు వంతెనల దగ్గర రైల్వే శాఖ చేపడుతున్న నూతన వంతెన పనుల్లో భాగంగా నగరపాలక సంస్థ తాగునీటి పైప్‌లైన్ షిఫ్ట్ చేయడానికి సదరు రైల్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ మూడు వంతెనల దగ్గర రైల్వే వంతెన పనులు, పైప్‌లైన్ పరిశీలించారు.

భయం గుప్పెట్లో టిడ్కో కాలనీ

- నిత్యం సమస్యలతోనే సహజీవనం
- తాగునీరు, వీధి లైట్లకు ఇబ్బందులు
- పారిశుద్ధ్య నిర్వహణ లేక దోమల విజృంభణ
- పట్టించుకోని అధికారులు



మురుగు, పైప్ లీకులతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

గుంటూరు రూరల్: సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నామని పట్టించుకునే నాథుడు లేక నరకం చూస్తున్నామని మండలంలోని వెంగళాయపాలెం గ్రామ సమీపంలోని టిడ్కో నివాసాల ప్రజలు వాపోతున్నారు. ఇళ్లలోకి వచ్చిన నాటి నుంచి తాగునీరు, పారిశుద్ధ్యం సమస్యలతో సతమతమవుతున్నామంటున్నారు. తాగునీటి పైప్‌లైన్‌ల లీకేజీలతో ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. మరమ్మతులు సక్రమంగా చేయకపోవటంతో నిత్యం లీకేజీలు వస్తున్నాయని గుక్కెడు నీటికి ఇబ్బంది పడాల్సి వస్తుందని అంటున్నారు.

దుర్గంధం.. దోమల విజృంభణ

టిడ్కో నివాసాలలో పారిశుద్ధ్యం లోపించిందని పట్టించుకునే వారు కరువయ్యారని అంటున్నారు. కాలనీలోకి వచ్చి నెలలు గడుస్తున్నా కనీసం నేటికి పారిశుద్ధ్యం సిబ్బంది కనిపించిన దాఖలాలు లేవని అంటున్నారు. మురుగు కాల్వల్లో నీరు నిలిచి దుర్గంధానికి తోడు దోమల విజృంభణ పెరిగిపోయిందని వాపోతున్నారు. దోమల వల్ల విష జ్వరాల బారిన పడి ఇంటికి ఒకరిద్దరు మంచం పడుతున్నారని అంటున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది రాకపోవటంతో మురుగు నీరు రోడ్లపై పారుతోందని అంటున్నారు. రాత్రి సమయంలో వీధిలైట్లు వెలగక చీకటిలో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, రాత్రుళ్ళు విష సర్పాలతో సహజీవనం చేస్తున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయాల్లో మహిళలు అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాలంటే భయభ్రాంతులకు గురవ్వాల్సిన పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారు ప్రాంతం కావటంతో నిర్జన ప్రదేశాల్లో మందుబాబులు తాగి కేకలు వేస్తూ, సీసాలు పగలగొట్టి భయాందోళనకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

అడవులను తలపిస్తున్న ప్రాంతం

పారిశుద్ధ్య సిబ్బంది లేక నివాసాల చుట్టూ చెట్లు, గడ్డి పెరిగి అడవులను తలపిస్తున్నాయని, పెరిగిన చెట్లలో నుంచి పాములు నిత్యం తిరుగుతూనే ఉంటున్నాయంటున్నారు. విష సర్పాల బెడదతో చిన్నారులను బయటకు పంపాలంటే ప్రాణ భయం కలుగుతుందని అంటున్నారు. అధికారులు స్పందించి టిడ్కో నివాసాల్లో విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం సమస్యలను పరిష్కరించి తమను కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలు పెరిగి అడవిని తలపిస్తున్న నివాస ప్రాంతం

ధరల నియంత్రణలో కూటమి ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఆరేటి రామారావు

పొన్నూరు: కూటమి ప్రభుత్వం నిత్యావసరాల ధరల నియంత్రణలో విఫలమైందని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పుష్పాల సత్యనారాయణ బుజ్జి విమర్శించారు. సీపీఐ పిలుపు మేరకు డిమాండ్స్ డే సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ప్రజానాట్యమండలి కార్యదర్శి ఆరేటి రామారావు అధ్యక్షత వహించారు. సత్యనారాయణ బుజ్జి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే పెరుగుతున్న నిత్యావసరాలను నియంత్రిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను మరిచిందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో బిగించిన విద్యుత్ స్మార్ట్ మీటర్లను తీసివేయాలని, కొత్తగా స్మార్ట్ మీటర్లను బిగించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలానే రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం మోపుతున్న విద్యుత్ భారాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. 2022లో వినియోగించుకున్న బిల్లుల తాలూకా ఇప్పుడు యూనిట్‌కి ఒక రూపాయి చొప్పున వసూలు చేయటం అత్యంత బాధాకరమన్నారు. ఆరేటి రామారావు మాట్లాడుతూ ఎన్నికల హామీలలో సీఎం చంద్రబాబు వలంటీర్లకు పది వేలు ఇస్తామని చెప్పిన మాట మరువడమే కాకుండా, వారికి ఉద్యోగమే లేకుండా చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకొని వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి షేక్. గౌస్, గేయ రచయిత దేవరకొండ శ్రీనివాస్, ఆరేటి సురేష్, భవాని, సుగుణ, జాలమ్మ, కోటేశ్వరరావు, సాంబయ్య పాల్గొన్నారు.

హిందీ ప్రాముఖ్యాన్ని గుర్తించాలి



హిందీ ఉపాధ్యాయిని ప్రమీలాదేవికి జ్ఞాపిక అందజేస్తున్న ఎంఈఓ కెనడీ

కొండపాటూరు(కాకుమాను): జాతీయ భాష హిందీ ఔన్నత్యాన్ని విద్యార్థులలో పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని కొండపాటూరు ప్రీ హైస్కూల్‌లోని విద్యార్థులకు మంగళవారం హిందీ భాషపై పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో పాఠశాలలోని 43 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందరు విద్యార్థులు నూర శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని కొనియాడారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుండే హిందీ భాషపై ఆసక్తి పెంచుకుని రాణించాలని సూచించారు. ఈసందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. అనంతరం హిందీ భాష ఉపాధ్యాయిని సి.హెచ్.ప్రమీలాదేవిని శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శీలం అంకారావు, ఎస్ఎంసీ చైర్మన్ నాగాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు: దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్న విభిన్న ప్రతిభావంతులకు ఎల్లప్పుడూ టీడీపీ అండగా నిలిచిందన్నారు. దివ్యాంగులకు ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు, ఎంపీడీఓ చంద్రశేఖర్, డాక్టర్ ఫిరోజ్ ఖాన్, ఆర్టీసీ డిపో మేనేజర్ అజితకుమారి, దివ్యాంగుల రాష్ట్ర అధ్యక్షులు నీలం జోజిబాబు, నియోజకవర్గ అధ్యక్షులు ఎం.సాంబశివరావు, కార్యదర్శి ఎం. రాంబాబు, కోశాధికారి జి.విజయ్‌బాబు పాల్గొన్నారు.

20న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ గంగాధరరావు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం, ది అసోసియేషన్ ఆఫ్ చార్టెడ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ)లు సంయుక్తంగా ఈనెల 20వ తేదీన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) నిర్వహించనున్నట్లు కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ఆచార్య ఆర్.శివరాం ప్రసాద్ తెలిపారు. ఎఫ్‌డీపీ పోస్టర్‌ను మంగళవారం వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి సింహాచలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య శివరామ్ ప్రసాద్ మాట్లాడుతూ 'ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్టాండర్డ్స్' అనే అంశంపై ఎఫ్‌డీపీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్స్‌గా ముంబై ఏసీసీఏ నుంచి జాకీర్ ఎ.సయిద్, చెన్నై నుంచి కె. రాయిస్టన్ ఎబినేజర్ హాజరవుతారన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో జియాలజీ విభాగాధిపతి పీజే రత్నాకర్ పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి



చేబ్రోలు: ప్రకృతి వ్యవసాయంలో వివిధ పంటల సాగు చేయటం వలన అధిక ఆదాయం పొందవచ్చునని జిల్లా వనరుల కేంద్రం డెప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత అన్నారు. చేబ్రోలు మండలం సుద్దపల్లి, శలపాడు గ్రామలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ సునీత, పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు రామ కోటేశ్వరి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: తెగుళ్ల పట్ల మిర్చి రైతులు అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు ఉద్యానశాఖ అధికారి ఎం.బేబి అన్నారు. మండల పరిధిలోని పాతమల్లాయపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మిర్చిలో బొబ్బర తెగులు, శనగలో ఎండుతెగులును బొబ్బర తెగులు సోకిన రైతులు పంటను పీకివేసి తెగులు వ్యాపించకుండా నివారించాలన్నారు. అదేవిధంగా శనగలో ట్రైకోడెర్మావిరిడీ, హెపాకోనజోల్, థిరమ్‌లను నిర్ణీత మోతాదు ప్రకారం వినియోగించాలని సూచించారు.

రైతులు బీమా ప్రీమియం చెల్లించాలి

కొండపాటూరు(కాకుమాను): ఈ ఏడాది రబీ సీజన్‌లో మొక్కజొన్న, శనగ, మినుము, పెసర వంటి పంటలు సాగు చేసే రైతులు పంటకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని కొండపాటూరు, బీకేపాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేసే రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో మీ సేవా కేంద్రాలలో పంటల బీమాకు చలానా చెల్లించాలని ఆమె తెలిపారు.

వయ్యారిభామ కలుపు మొక్కల నిర్మూలన ముఖ్యం



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

గుంటూరు రూరల్: పంటలకు, ప్రజలకు హాని కలిగించే కలుపు మొక్క వయ్యారి భామ మొక్కను నిర్మూలించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణలత తెలిపారు. మంగళవారం మండలంలోని జొన్నలగడ్డలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు జాతీయ సేవాపథకంలో భాగంగా వయ్యారిభామ కలుపు మొక్క(పార్థీనియం) నివారణపై ప్రజలకు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కలుపు మొక్క వలన కలిగే సమస్యలను వివరించారు. మొక్కను పూత దశకు రాకముందే నిరోధించాలని, గట్లు మీద ఉన్న మొక్కలను తొలగించాలని ఎండిన అనంతరం తగలబెట్టాలని సూచించారు. దోమల నివారణపై ర్యాలీ నిర్వహించి, దోమలు రాకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వంగ నవీన్‌రెడ్డి, డాక్టర్ ఎం రమాదేవి, నామ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో ఎల్ఎస్‌జీడీపై శిక్షణ

సర్పంచులు గైర్హాజరు



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న సెక్రటరీ మూర్తి

ప్రత్తిపాడు: ఎల్ఎస్‌జీడీ(సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, స్థానికీకరణ)పై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంపై అటు ప్రజాప్రతినిధులు, ఇటు మండల స్థాయి అధికారులు ఆసక్తి చూపలేదు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎల్ఎస్‌జీడీపై సర్పంచులు, మండల స్థాయి అధికారులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా సర్పంచులు, మండల అధికారులు హాజరు కావలసి ఉంది. కానీ వారికి సకాలంలో సమాచారం లేకపోవడంతో సర్పంచులు హాజరు కాలేదు. మండలంలో మొత్తం పదహారు గ్రామ పంచాయతీలుండగా ఒక్క పాతమల్లాయపాలెం సర్పంచి మాత్రమే హాజరయ్యారు. కాగా మండల స్థాయి అధికారులందరికీ ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ అధికశాతం మంది అధికారులు హాజరు కాలేదు. తొలిరోజు మొత్తం పదమూడు మంది అధికారులు శిక్షణకు హాజరు కావలసి ఉండగా, వారిలో కేవలం వెటర్నరీ, విద్యాశాఖ, ఐసీడీఎస్, హౌసింగ్, వెలుగుశాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. దీంతో డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, విలేజ్ సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, వెటర్నరీ, ఎనర్జీ అసిస్టెంట్లుకు శిక్షణ ఇచ్చారు.

సుస్థిర ప్రణాళికలతోనే గ్రామాభివృద్ధి..

సుస్థిర అభివృద్ధి ప్రణాళికలతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని డీఎల్‌పీఓ కె.శ్రీనివాసరావు అన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ, ఎంపీడీఓ కె.శివపార్వతి ప్రారంభించారు. శిక్షణను డీఎల్‌పీఓ శ్రీనివాసరావు పరిశీలించారు. గ్రామాల అభివృద్ధిలో గ్రామసభల పాత్ర అనిర్వచనీయమన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రవికుమార్ పాల్గొన్నారు.

మీ హద్దు రాళ్లు మీరే పాతించుకోవాలి

ప్రత్తిపాడు: ప్రస్తుతం రీ సర్వే ప్రక్రియ నిలిచిపోయిందని, సర్వే సిబ్బంది సర్వే మాత్రమే చేస్తారని, మీ హద్దు రాళ్లను మీరే మీ పొలంలో పాతించుకోవాలని తహసీల్దార్ జి. కరుణకుమార్ సూచించారు. మండల పరిధిలోని పాతమల్లాయపాలెంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. హాజరైన తహసీల్దార్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కారుమూరి మల్లేశ్వరి, తన పట్టాదారు పాసుపుస్తకం సమస్యతో పాటు సర్వే సమస్యను తహసీల్దార్‌కు విన్నవించింది. నూతన పాస్‌పుస్తకానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా సర్వేకు కూడా దరఖాస్తు చేసుకోవాలని, సర్వే సిబ్బంది వచ్చి సర్వే చేసి హద్దులు చూపిస్తారని, ఆ హద్దుల్లో మీరే రాళ్లు పాతుకోవాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

పొన్నూరు: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిబ్బంది పనిచేయాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఆరెమండ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో మ్యుటేషన్లపై 6, రిప్లేస్‌మెంట్ పాస్‌బుక్ కోసం 4, ఎఫ్ లైన్ 1, అడంగల్ నేమ్ కరక్షన్, 1, క్యాస్ట్ సర్టిఫికెట్ కోసం 19, ఎన్‌కమ్ 3 అర్జీలు వచ్చినట్లు వాటిని 30 రోజుల్లో పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయానికి తాళం

ఇది మండలంలోని తహసీల్దార్ కార్యాలయం. ఎప్పుడు ప్రజలతో రద్దీగా ఉంటుంది. మంగళవారం మధ్యాహ్నం మాత్రం ఖాళీగా ఉంది. అందునా మధ్యాహ్నం 12.30 గంటలకు తలుపులకు తాళాలు వేసి ఉండడంతో ప్రజలు విస్తుపోయారు. ఈ విషయమై తహసీల్దార్‌ని సంప్రదించగా అందరం డ్యూటీపై వెళ్లాం. మీ ఇష్టం వార్త రాసుకుంటే రాసుకోండి అంటూ సమాధానం ఇచ్చారు.

- కాకుమాను



వ్యవసాయశాఖ కార్యాలయానికి..

వ్యవసాయశాఖ కార్యాలయాన్ని సిబ్బంది కొరత పట్టిపీడిస్తుంది. సిబ్బంది ఫీల్డ్ విజిట్‌కో లేక సమావేశాలకో వెళితే కార్యాలయానికి తాళాలు పడాల్సిన దుస్థితి. ఆ చిత్రమే ఇది. మంగళవారం ఏవో అరుణకుమారి పొలం పిలుస్తుంది కార్యక్రమానికి పాతమల్లాయపాలెం వెళ్లగా, ప్రత్తిపాడు రైతు సేవ కేంద్రాల్లో ఉండాల్సిన సిబ్బంది ఒకరు ఎంపీడీవో కార్యాలయంలో ట్రైనింగ్‌కు, మరొకరు జేడీఏ కార్యాలయానికి వెళ్లడంతో మండల వ్యవసాయశాఖ కార్యాలయం తెరిచే వారు కరువయ్యారు.

- ప్రత్తిపాడు

అధిక ధరలకు టికెట్లు విక్రయిస్తే చర్యలు

తహసీల్దార్ కరుణకుమార్



క్యాంటీన్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

ప్రత్తిపాడు: అధిక ధరలకు సినిమా టికెట్లు విక్రయించరాదని తహసీల్దార్ జి.కరుణకుమార్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మారుతి థియేటర్‌లో ప్రదర్శిస్తున్న పుష్ప–2 సినిమా టికెట్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో మంగళవారం సాయంత్రం ఆయన థియేటర్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. థియేటర్‌లో నిబంధనలకు అనుగుణంగా అన్ని రకాల వసతులు, సదుపాయాలు ఉన్నాయా? లేవా? అన్న విషయాలతో పాటు పార్కింగ్, క్యాంటీన్, మరుగుదొడ్లను పరిశీలించారు. టికెట్ విక్రయ కౌంటర్ వద్ద, క్యాంటీన్‌లో ధరల పటికలు లేకపోవడంపై థియేటర్ నిర్వాహకులను ప్రశ్నించారు. అధిక ధరలకు విక్రయించుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన ప్రత్యేక అనుమతుల సమయం ముగిసిన తరువాత, థియేటర్‌కు ఉన్న బిఫారం అనుమతుల ప్రకారం సినిమా టికెట్లు ధరలు రూ. 20, రూ. 40కు మాత్రమే విక్రయించాలన్నారు. నివేదికను ఆర్డీఓకు పంపడం జరుగుతుందని తహసీల్దార్ కరుణకుమార్ తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



వల్లూరు(కాకుమాను): భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బి.వెంకటస్వామి తెలిపారు. మండలంలోని వల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు, భూ తగాదాలు, సెక్షన్ 22ఏ తారుమారు వంటి సమస్యలు ఉన్న రైతులు సదస్సులలో అర్జీల రూపంలో అందజేసి వాటిని పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అడంగల్, పట్టాదారు పాసుపుస్తకాల కోసం 16 అర్జీలు, సర్వేకు సంబంధించి 17, ఇతర శాఖల సంబంధించి 3 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ రాంబాబు, ఇన్‌చార్జి సర్వేయర్ బి.శ్రీనివాసరావు, ఆర్ఐ సిహెచ్.క్రాంతి ప్రియదర్శిని పాల్గొన్నారు.